




# నేటి దిక్సూచి

తెలుగు జాతీయ దినపత్రిక

ఆదివారం 28జూన్ 2026


# అక్రమవెంచర్ కు అండ ఎవరిది?

## -గట్టుప్పల్‌లో అనుమతులు లేకుండానే ప్లాట్ల విక్రయాలు..

## -సర్పంచ్, స్థానిక విలేకరి పేరు ప్రచారంలోకి..

## -అధికారుల మౌనం అనుమానాలకు తావు





నల్గొండ (ప్రతినిధి /నేటి దిక్సూచి,): గట్టుప్పల్ మండలంలో అక్రమ వెంచర్ల వ్యవహారం రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతోంది. సంబంధిత శాఖల అనుమతులు లేకుండానే వ్యవసాయ భూములను ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నా, అధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. గ్రామంలోని సర్వే నంబర్లు 158/అ1, 159/అ/1లో నిబంధనలకు విరుద్ధంగా వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్ల విక్రయాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.స్థానికంగా జరుగుతున్న ప్రచారం ప్రకారం, ఈ వెంచర్ల వ్యవహారంలో గ్రామ సర్పంచ్‌తో పాటు ఓ స్థానిక విలేకరి పేరు కూడా వినిపిస్తోందని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు. ఈ ప్రచారంలో ఎంతవరకు నిజం ఉందో సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.భూములను ఒకటి, రెండు గుంటల చొప్పున నాలా చేయించి, పూర్తి లేఅవుట్ అనుమతులు లేకుండానే అమాయక ప్రజలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గట్టుప్పల్ మండలం ఏర్పడిన తర్వాత భూముల ధరలు పెరగడంతో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలను పక్కనబెట్టి భారీగా అక్రమ వెంచర్లకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**ప్రభుత్వ ఆదాయానికి గండి...**

చట్టబద్ధమైన లేఅవుట్ అనుమతులు పొందాలంటే రహదారులు, డ్రైనేజీ, విద్యుత్ సదుపాయాలు, గ్రీన్ ఏరియా, ప్రజా అవసరాల కోసం స్థలం కేటాయించడం, ప్రభుత్వానికి నిర్దేశిత రుసుములు చెల్లించడం తప్పనిసరి. కానీ వీటిని పాటించకుండా ప్లాట్లు విక్రయించడం వల్ల ప్రభుత్వానికి ఆదాయ నష్టం వాటిల్లుతోందని తెలుస్తోంది.

**మోసపోతున్న కొనుగోలుదారులు**

అనుమతులు లేని వెంచర్లలో స్థలాలు కొనుగోలు చేసిన వారు తర్వాత ఇంటి నిర్మాణ అనుమతులు, బ్యాంకు రుణాలు, విద్యుత్ వంటి మౌలిక సదు-పాయాలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో జీవితాంతం కూడబెట్టిన డబ్బుతో స్థలం కొనుగోలు చేసిన వారు నష్టపోతున్న పరిస్థితి ఏర్పడుతోంది.

**విచారణ జరిపి వాస్తవాలు బయటపెట్టాలి..**

అక్రమ వెంచర్లపై వస్తున్న ఆరోపణలు, స్థానికంగా జరుగుతున్న ప్రచారంపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన వారు ఎవరైనా సరే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ లేఅవుట్లపై కఠిన చర్యలు తీసుకుంటేనే ఇటువంటి దందాలకు అడ్డుకట్ట పడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# సీఎం పర్యటనకు ముందే నల్గొండలో రాజకీయ కలకలం

## ప్రోటోకాల్‌పై అభ్యంతరాలు.. ప్రచారంలో ఫొటోల వివాదం.. ముందస్తు పోలీసు చర్యలతో వేడెక్కిన రాజకీయం




నల్గొండ,ప్రతినిధి/ నేటి దిక్సూచి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లా పర్యటనకు ముందే అధికార, రాజకీయ వర్గాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ప్రోటోకాల్ అమలు, అధికారిక ప్రచారంలో ప్రజాప్రతినిధులకు కల్పించిన ప్రాధాన్యం, పోలీసుల ముందస్తు చర్యలు వరుసగా చర్చకు దారితీయడంతో జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.హ్యామ్ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించి రోడ్లు--భవనాల శాఖ విడుదల చేసిన అధికారిక ప్రకటనల్లో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఫొటో లేకపోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు కారణమైంది. నల్గొండ జిల్లాకు చెందిన కీలక ప్రజాప్రతినిధి అయినప్పటికీ అధికారిక ప్రచారంలో ఆయనకు స్థానం కల్పించకపోవడంపై గుత్తా అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారాన్ని ప్రోటోకాల్ ఉల్లంఘనగా పరిగణిస్తూ సంబంధిత అధికారులపై వివరణ కోరడంతో పాటు అవసరమైతే నోటీసులు జారీ చేసే దిశగా చర్యలు ఉండొచ్చన్న ప్రచారం సాగుతోంది.ఇదే సమయంలో సీఎం పర్యటనకు సంబంధించిన ప్రోటోకాల్ జాబితాలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పున్నా కైలాష్ పేరు లేకపోవడం మరో వివాదానికి దారితీసింది. పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీల్లో కూడా ఆయన ఫొటో కనిపించకపోవడంతో కాంగ్రెస్ నాయకుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. బలహీన వర్గాలకు చెందిన నాయకుడిని ఉద్దేశపూర్వకంగా పక్కన పెడుతున్నారంటూ కొందరు బీసీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారు.

మరోవైపు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వర్గానికి చెందిన ఓ అనుచరుడిని పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం రాజకీయ చర్చకు దారితీసింది. ముఖ్యమంత్రి సభలో మంత్రి పదవి అంశంపై నిరసన వ్యక్తమయ్యే అవకాశం ఉందన్న సమాచారంతోనే ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఒకే కార్యక్రమానికి సంబంధించి ప్రోటోకాల్ వివాదం, అధికారిక ప్రచారంలో ప్రజాప్రతినిధుల ఫొటోల వ్యవహారం, కాంగ్రెస్‌లో అంతర్గత అసంతృప్తి, ముందస్తు అరెస్టులు వంటి పరిణామాలు చోటుచేసుకోవడం జిల్లాలో రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించింది. ఈ పరిణామాలు అధికార పార్టీలో అంతర్గత సమన్వయంపై కూడా ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.






# ఉప సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షుడుగా మచ్చ అనిల్

-ప్రధాన కార్యదర్శి దెంది మధుకర్ రెడ్డి

-యాచారం మండలం ఉప సర్పంచ్ ల సమావేశం

-ఉప సర్పంచులు గ్రామ అభివృద్ధి కోసం కృషి



యాచారం నేటి ప్రభాత సూర్య:. యాచారం మండల కేంద్రంలో సాయి శరణం ఫంక్షన్ హాల్ లో యాచారం మండల ఉప సర్పంచుల ఎన్నికల సమావేశాన్ని నిర్వహించారు. ఉప సర్పంచ్ల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం ఉ ప సర్పంచుల కమిటీని ప్రకటించారు. ఉప సర్పంచ్ సంగం అధ్యక్షుడుగా మచ్చ అనిల్ ఎంపిక చేశారు. (గునుగల్) ఉపాధ్యక్షుడు విస్లావత్ రాజు( తక్కల్లపల్లి), ప్రధాన కార్యదర్శి దెంది మధుకర్ రెడ్డి (మేడిపల్లి), జైంట్ కార్యదర్శిలు గౌర నాగరాజు( ధర్మన్నగూడ), అన్న మౌని రవీందర్ (కురుమిద్ద), ట్రెజరర్ రెడ్డముని శిరీష వెంకటేష్ యాదవ్( మల్కీజ్ గూడ), ఎగ్జిక్యూటివ్ సభ్యులు కుమ్మరిగూడెం మంగ కృష్ణ( యాచారం), గౌర లక్ష్మణ్( గడ్డ మల్లయ్య గూడ), నాయిని శ్రీకాంత్( చింతుల్ల) అనిత రమేష్ (కొత్తపల్లి ),కొండాపురం మల్లమ్మ ( మాల్), సువర్ణ వెంకటేష్ ( తక్కల్లపల్లి), సభ్యులను ఎన్నుకున్నారు. వారందరికీ శాల్వాతో సన్మానించారు. ఉపసర్పచ్ లు ఐక్యంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. గ్రామాలలో ప్రజల పక్షాన నిలబడి అభివృద్ధి కోసం పాటుపడాలని సమీక్ష చేశారు. సర్పంచ్ లు గ్రామ అభివృద్ధి కి సహకరించిన యెడల ప్రజల పక్షాన అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో 24 గ్రామపంచాయతీల ఉప సర్పంచులు పాల్గొన్నారు.